
సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 18 । జూన్ । 2023

నాన్న



ప్రపంచానికి మనల్ని చూపేది అమ్మ.. ప్రపంచాన్ని మనకు చూపేది నాన్న. అమ్మ జన్మనిస్తే.. నాన్న ఆ జన్మకు రూపమిస్తారు. తల్లి అంటే ఎంత ప్రేమో...తండ్రి అంటే కూడా అంతే ప్రేమ. నాన్న గంభీరంగా ఉంటారు.. అందుకే పిల్లలు నాన్నకు భయపడతారు. కానీ.. నాన్నకు ఏదైనా ఇబ్బంది వస్తే మాత్రం పిల్లలు సెకను కూడా ఆగలేరు. అదే పిల్లలకు, నాన్నకు మధ్య ఉన్న అనుబంధం. తండ్రి పిల్లల కల నెరవేర్చడానికి కష్టపడుతుంటారు. ఎన్నో త్యాగాలు చేసి పిల్లల మొహంలో సంతోషాన్ని నింపాలనుకుంటారు. అదే నాన్న గొప్పతనం. నేడు ఫాదర్స్ డే.. ఈ సందర్భంగా నాన్నతో పలువురి బంధం.. అనుబంధం..

నాన్న కష్ట జీవి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: మాది వెల్గటూర్ మండలం పైడిపల్లి. వ్యవసాయక కుటుంబం. నాన్న గంగుల మల్లయ్య పటేల్. వ్యవసాయం, కాంట్రాక్ట్ పనులు చేయించేది. నలుగురు అన్నదమ్ములమైన మమ్మల్ని ఉన్నతంగా చదివించాలని ఆరాటపడేవారు. గ్రామంలో ఎ వరికీ ఏ ఆపద వచ్చినా.. డబ్బులు సర్దుబాటు చేసేవారు. నాన్న ప్రోత్సాహంతో రాజకీయాల్లో చేరి 25ఏళ్లుగా కౌన్సిలర్, కార్పొరేటర్, ఎమ్మెల్యే, మంత్రిగా ప్రజాసేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. నాన్న పేరు నిలబెట్టాననే ఆనందం ఉంది.

– గంగుల కమలాకర్, రాష్ట్ర మంత్రి

పుస్తక పఠనంపై ఆసక్తి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: నాన్న జననేషన్ వీరరాఘవన్ కవి. ఉద్యోగ రీత్యా లైబ్రేరియన్ కావడంతో నాకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనంపై ఆసక్తి. నాన్న రాసిన కథల నుంచి స్ఫూర్తి పొంది చదువుపై మమకారం పెరిగింది. నాన్న చూపిన చొరవ నన్ను సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడానికి దోహదపడింది. – ఆర్వీ కర్ణన్, కరీంనగర్ కలెక్టర్

జీవిత గురువు



జగిత్యాల: నాన్న మాకునూరి హన్మంతరావు 63ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేశారు. ఆయనే నా తొలిగురువు. నాన్న ప్రోత్సాహంతోనే వైద్య, రాజకీయ రంగంలోకి వచ్చా. నాన్నకు వ్యవసాయమంటే మక్కువ. ఆయన ఆలోచనకు అనుగుణంగా మెడిసిన్ పూర్తి చేసి నేత్రవైద్యుడిగా ఇప్పటివరకు 30వేల మందికి పైగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశాను. ఎమ్మెల్యేగా ఎంతబిజీగా ఉన్నా వైద్య వృత్తిని కొనసాగిస్తున్నా. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సాయంత్రం కాసేపు నాన్నతో మాట్లాడితే ఒక స్నేహితుడితో మాట్లాడిన ఫీలింగ్ ఉంటుంది. నాన్నే నాకు ఆత్మీయ మిత్రుడు.

– సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

ప్రోత్సాహం మరువలేనిది



నాన్న సత్యనారాయణమూర్తి ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. కుటుంబ బాధ్యతలు అన్ని భుజాన వేసుకున్నారు. కష్టపడి అందరినీ ప్రయోజకులను చేశారు. నన్ను డాక్టర్ కావాలని సూచించేవారు. ఇంజినీరింగ్‌పై ఆసక్తితో నేను బీటెక్ పూర్తి చేసి.. గ్రూప్స్‌రాసి ఉద్యోగం సాధించాను.

– ప్రియాంక, జెడ్పీ సీఈవో, కరీంనగర్

నాన్నే స్ఫూర్తి



నాన్న సుగుణాకర్‌రావు అలియాస్ రాజేశ్వరరావు వృత్తి రీత్యా కాంట్రాక్టర్. చిన్నప్పటి నుంచే నాన్నలోని ముక్కు సూటితనం, ధైర్యం సేవా గుణం ఆకట్టుకుంది. చదువుకుంటున్న సమయంలోనే నాకు రాజకీయ లక్షణాలు వచ్చాయి. 20 ఏళ్లుగా రాజకీయ పదువులలో కొనసాగుతూ ప్రజలకు సేవ చేసే విషయంలో నాన్నే స్ఫూర్తి.

– వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

బట్టలు కుట్టి..



పాలకుర్తి: నాన్న దర్జీ పని చేస్తూ చదివించారు. ప్రస్తుతం భౌతికంగా లేకపోయినా.. ఆయన ఆలోచన విధానాలు మా వెంటే ఉన్నాయి. బసంత్‌నగర్‌లో నాన్న పరికిపండ్ల సత్యనారాయణ స్మారకార్థం ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి పేదలకు సేవ చేస్తున్నాం. – పరికిపండ్ల నరహరి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఐఅండ్ పీఆర్ కమిషనర్

కొండంత అండ



సాక్షి, పెద్దపల్లి: నాన్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ. రాజకీయాల్లో బిజీగా ఉన్నా నాకోసం రోజూ కొంత సమయం కేటాయించేవారు. బాల్యంలో చదువు నిర్లక్ష్యం చేయవద్దని కొంత కఠినంగా చెప్పినా, ఉన్నత చదువులు, వృత్తిని ఎంచుకునే సమయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. నాన్న నాకు మంచి స్నేహితుడు, అంతకు మించి విమర్శకుడు. నేను ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తరువాత మనం ఒకప్పుడు పేదవాళ్లమే.. సాయం కోసం నీ దగ్గరకు వచ్చే వారితో సొంత మనిషిలా వ్యవహరిస్తూ.. సమస్య పరిష్కరించడానికి ప్రయత్నించాలని చెప్పారు. ఇప్పటికీ నాన్న ఇచ్చే సలహాలనే పాటిస్తా.

– డాక్టర్ సంగీత సత్యనారాయణ, కలెక్టర్ పెద్దపల్లి

నాన్న నుంచే కష్టపడే తత్వం..



సిరిసిల్లక్రైం: నాన్న రాకేశ్‌కుమార్ గుప్తా. కిరాణం నడిపేవారు. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు షాపు నడపడం చూశా. సామాజిక సేవకు నాన్నే గురువు. తనతో సంతోషంగా గడిపిన రోజులు చాలా ఉన్నాయి. నేను ఐపీఎస్‌కు ఎంపికయ్యాక నాన్నతో కలిసి దిగిన ఫొటో నేనెప్పుడూ మరిచిపోలేను.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

నాన్న మాటలే దారి చూపాయి



సాక్షిప్రతినిధికరీంనగర్/కరీంనగర్: నాన్న లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇంటినుంచి వెళ్లాలంటే కలెక్టర్ కార్యాలయం ముందు నుంచే వెళ్లేవారు. కలెక్టర్ అంటే జిల్లాకు అధికారి అని ఏ పని అయిన చేయవచ్చనని నాన్న ఇతరులతో మాట్లాడే సందర్భాలు నన్ను కదిలించాయి. ప్రతీరోజు దినపత్రికలు చదివే నాన్నను చూసి నేనూ పేపర్లు చదివేవాడిని. ఆయన స్ఫూర్తితోనే సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించాను.

– ఆవుల సాయికృష్ణ, సివిల్స్ ర్యాంకర్, కరీంనగర్

బడిలో..ఇంట్లో పాఠాలే చెప్పారు



కోరుట్ల: నాన్న అంజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. వ్యవసాయం కూడా ఉండడంతో పొలం, స్కూల్ రెండూ చూసుకునేవారు. మేము చదువుపై దృష్టి పెట్టేలా శ్రద్ధ తీసుకునేవాడు. ప్రభుత్వ టీచర్ అయినా జీతం తక్కువే . అమ్మ పుష్పలత వ్యవసాయ పనులు చూస్తూ ఉండటం.. వచ్చే డబ్బులతో నా చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. సివిల్స్ ఫలితాలు వచ్చిన రోజు నేను ఢిల్లీలోనే ఉన్న. నాన్నకు ఫోన్ చేసి 132వ ర్యాంకు వచ్చిందని చెప్పగానే ఉద్వేగంతో..'కంగ్రాట్స్'అన్నారు. నాన్న కల నెరవేర్చానన్న తృప్తి మిగిలింది.

– ఏనుగు శివమారుతిరెడ్డి, సివిల్స్ ర్యాంకర్, కోరుట్ల

సజ్జలు అమ్మి చదివించారు



సిరిసిల్ల: మాది నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గాజినగర్. అమ్మ పార్వతి, నాన్న మాన్యానాయక్. నలుగురం అన్నదమ్ములం, ఐదుగురు అక్కలు. నేను చిన్నోడిని. నన్ను చెల్లెను మాత్రమే చదివించారు. నాన్న వ్యవసాయం చేసేవారు. నీటి వసతి లేని భూమి ఉండేది. మా ఊరి దగ్గర పెళ్లిపాకాల చెరువులో చేపలు పట్టేవారు. నేను దేవరకొండలో హాస్టల్‌లో ఉండి చదువుకున్న. ఇంటర్ బైపీసీలో సైన్స్‌బాక్స్ కొనేందుకు డబ్బులు లేకపోతే ఇంట్లోని సజ్జలు అమ్మారు. నాకు వ్యవసాయ పనులు నేర్పించారు. డిగ్రీ కాగానే స్పెషల్ టీచర్‌గా పని చేశా. ఆర్టీసీ కండక్టర్‌గా, గోదాం మేనేజర్‌గా చేశా. 1995లో గ్రూప్–2 ద్వారా రెవెన్యూశాఖలో ఉద్యోగం వచ్చింది. నేను తహసీల్దార్‌గా ఉండగా.. 2007లో నాన్న చనిపోయారు. నేను ఈ రోజు ఈ స్థాయికి వచ్చానంటే నాన్న చలువే. – నేనావత్ ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల



తండ్రి జ్ఞాపకంగా విగ్రహం

జమ్మికుంట: ఇప్పటివరకు రాజకీయనాయకులు.. ఉన్నతమైన వ్యక్తులకు మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేయడం చూశాం. కానీ.. ఓ తండ్రి చనిపోతే.. ఆయన జ్ఞాపకంగా విగ్రహం ఏర్పాటు చేశారు అతని పిల్లలు. అక్కడే ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన పొట్లపల్లి జయరామారావు పట్వారి. పట్వారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశాడు. తెలంగాణ తొలి ఉద్యమ సమయంలో రాజకీయాల్లోకి వచ్చారు. జమ్మికుంట జెడ్పీటీసీగా పనిచేశాడు. మూడేళ్లక్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన కొడుకు పొట్లపల్లి శ్రీధర్‌బాబు, కూతురు కంకటి శ్రీదేవి వ్యవసాయక్షేత్రం జయరామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు.

మా ఫాదర్ గ్రేట్



కోల్‌సిటీ(రామగుండం): మా నాన్న బుచ్చిరాజం. నాతో ఫ్రెండ్‌లా ఉంటారు. హిందీ టీచర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఇప్పుడు 82 ఏళ్లు. నాన్న నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. కానీ బీటెక్ చేసి, మున్సిపల్ కమిషనర్ అయ్యా. ప్రయోజకుడివయ్యావని అభినందించారు. ఇంత వయసొచ్చినా నాన్నకు ఇంకా నేను పిల్లాడినే. 1991లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న సమయంలో ఒకరోజు జగిత్యాలలోని మా ఇంట్లో భోజనం తయారు చేసి బస్సులో పట్టుకొచ్చాడు. కాసేపు మాట్లాడితే సంతృప్తిగా ఉంటుంది. మా ఫాదర్ గ్రేట్. – బి.సుమన్‌రావు, కమిషనర్, రామగుండంనగరపాలక సంస్థ

కిడ్నీ ఇచ్చి బతికించారు



మాది గోదావరిఖనిలోని రమేశ్‌నగర్. ప్రస్తుతం కర్నాటకలో బళ్లారిలోని ఓ స్టీల్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న. నాన్న కిష్టయ్య సింగరేణిలో పని చేసి రిటైర్ అయ్యారు. నాకు 2004లో కిడ్నీలు చెడిపోయాయి. ఎవరైనా కిడ్నీ దానం చేస్తే తప్ప బ్రతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. దీంతో నాన్న, అమ్మ సుశీల ఆర్థికంగా, మానసింగా చాలా కష్టపడ్డారు. ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ఉన్న నాకు కిడ్నీదానం చేయడానికి నాన్న ముందుకు వచ్చారు. చాలా మంది వద్దని వారించారు. కానీ నా కొడుకు బతుకు ముఖ్యమంటూ కిడ్నీఇచ్చి నన్ను బతికించుకున్నాడు.

– పోతర్ల జయాకర్ రాజు, సీనియర్ మేనేజర్, బళ్లారి, కర్నాటక

న్యూస్‌రీల్

విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న డీఈఓ మాధవి

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న విద్యాదినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు సహకరించాలని డీఈవో మాధవి సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను డీఈవో దృష్టికి తెచ్చారు. సర్వీస్ క్రమబద్ధీకరణ సత్వరమే చేయాలని, పదోన్నతి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ కోరారు. నాయకులు షేక్, ఎంఈఓ సురేందర్ తదితరులున్నారు.

నేడు మంచినీళ్ల పండుగ

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ మంచినీళ్ల పండుగ నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఉదయం 8 గంటల నుంచి 10:30 వరకు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అంతర్గాం మండలం ముర్మూర్‌లోని 160 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను జిల్లాలోని పలు ప్రాంతాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మున్సిపాలిటీలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేసే విధానాన్ని వివరిస్తారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హామీలు హాస్యాస్పదం

- దేశానికి పాఠాలు నేర్పుతున్న బీఆర్ఎస్
- మంథనిలో మార్పు తప్పకుండా వస్తుంది
- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఖమ్మంపల్లి వద్ద రెండు జిల్లాల వారధి ప్రారంభం



వంతెన ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ, జెడ్పీచైర్మన్లు

మంథని: నలభై ఏళ్ల అధికారంలో ఉండి ప్రజలకు ఏమీ చేయని కాంగ్రెస్.. ఇప్పుడు అవకాశం ఇస్తే ఏదో చేస్తామని హామీలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లి వద్ద మానేరు నదిపై రూ.50 కోట్లతో నిర్మించిన వంతెనను ఎంపీ వెంకటేశ్ నేత, జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కుశ్రీహర్షిణితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం బహిరంగసభలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్ల పెంపు, పంటపెట్టుబడి సాయం వంటి ప్రజోపయోగ పథకాలను ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక పథకాలు అమలవుతున్నాయని, ఫలితంగా రాష్ట్రం దేశానికే దిక్సూచీగా నిలుస్తోందని తెలిపారు. అన్ని పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్‌కే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. రాష్ట్రంలో మరోసారి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు.

మంథనిలో మార్పు తథ్యం..

పుట్ట మధు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ 40 ఏళ్లలో చేయని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించారని, అందుకే వచ్చే ఎన్నికల్లో మంథనిలో మార్పు తథ్యమని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 23వంతెనలు నిర్మించారని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు మధుకే ఉంటాయన్నారు. మంథని అభివృద్ధిని పట్టని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ప్రజలను మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నారని, అతడిని నమ్మవద్దని పుట్ట మధు అన్నారు. ముందుగా ఖమ్మంపల్లి నుంచి వంతెన వరకు రూ.55లక్షలతో చేపట్టే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జెడ్పీటీసీ స్వర్ణలత, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తండాలకు గుర్తింపునిచ్చింది కేసీఆరే..

మంథని: రాష్ట్రం ఏర్పడిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇచ్చింది ముఖ్యమంత్రి కేసీఆర్ అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని మండలం భట్టుపల్లి నిర్వహించిన గిరిజన దినోత్సవంలో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

రామయ్య కవితలు సమాజానికి హితోపదేశం

మంత్రకూట వేమనగా పేరొందిన రావికంటి రామయ్య గుప్తా తమ కవితల ద్వారా సమాజానికి హితోపదేశం చేస్తున్నారని కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో రామయ్య గుప్త 87వ జయంతిని నిర్వహించారు. కాలాన్ని నడిపించేది కవిత్వమేనని, విద్యార్థి లోకానికి రామయ్య రచనలు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్ రామయ్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, టింబర్ మర్చంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కొంతం కృష్ణమూర్తి, కొండేల మారుతి, రావికంటి శ్రీనివాస్ ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా అభ్యాసకులతో ఈడీ

జ్యోతినగర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఈడీ సునిల్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వరకు స్థానిక అంబేద్కర్ పార్క్‌లో యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి, స్వచ్ఛమైన గాలి మధ్య యోగా, వ్యాయామం చేస్తే ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. యోగా ప్రాచీన సంప్రదాయ బహుమతి అని పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లు ప్రసేంజిత్ పాల్, ఏకే.దేశాయ్, ఠాగూర్, రవీంద్ర, ఏజీఎం(హెచ్ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం.. విద్యతో విజ్ఞానం

క్రీడలతో ఆరోగ్యం.. విద్యతో విజ్ఞానం లభిస్తుందని ఈడీ సూచించారు. మహాత్మా గాంధీ క్రీడామైదానంలో గ్రామీణ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలని సూచించారు. ఎన్టీపీసీ ఎన్నీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

- తండాల్లో పంచాయతీలకు పక్కాభవనాలు
- గిరిజన దినోత్సవంలో కలెక్టర్ సంగీత

ఓదెల: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ సంగీత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. తండాల్లో పంచాయతీలకు పక్కాభవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లంబాడితండాలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారని, వాటికి పక్కాభవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. గిరిజనుల కోసం హాస్టళ్లు, గురుకులాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తండాలో సేవాలాల్ మందిరం, విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని తండావాసులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ముందుగా కలెక్టర్‌కు గిరిజనులు నృత్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దాసరి మాట్లాడుతూ.. లంబాడితండాకు రూ.4.30 కోట్లతో తారు రోడ్డు వేశామన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గతంలో రూ.8లక్షలు మంజూరు కాగా, ప్రస్తుతం రూ.7లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు గుగులోతు లక్ష్మి, ఉపసర్పంచు నిమ్మనాయక్, ఎంపీపీ కునారపు రేణుకదేవి, డీపీవో చంద్రమౌళి, పీడీ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ రమేశ్, ఆయాశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలి సస్పెన్షన్

- మాతాశిశు కేంద్రంలో పసికందు మృతి వ్యవహారంలో..
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సంగీత మరో వైద్యురాలికి మెమో

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రిలో ఇటీవల గర్భస్థ శిశువు మరణించిన వ్యవహారంలో వైద్యురాలు శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంగీత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైద్యురాలు రుక్మిణిని వివరణ ఇవ్వాలంటూ మెమో జారీ చేశారు. ఈనెల 14న డ్యూటీలో ఉన్న వైద్యురాలు రుక్మిణి ఆధ్వర్యంలో గర్భిణికి వైద్య సేవలందాయి. మరుసటిరోజు విధులు నిర్వర్తించిన శ్రీదేవి గర్భిణి కొప్పుల మమతకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రామగుండం వైద్య కళాశాల వైద్యురాళ్లు శ్రీదేవి, శిరోమణి, భానుతో కూడిన బృందాన్ని నియమించామని కలెక్టర్ పేర్కొన్నారు. వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని వివరించారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి యువకుడి మృతి


మహేశ్‌ (ఫైల్‌)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన దామరపెల్లి మహేశ్‌ (34) శనివారం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఎస్సై శ్రీనివాస్‌, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మహేశ్‌ ఇద్దరు చిన్నారులతో కలిసి గ్రామ శివారులోని గోపాల్‌రెడ్డి వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. చిన్నారులు ఒడ్డున ఉండగా మహేశ్‌ బావిలోకి దూకాడు. ఎంతకూ పైకి రాకపోవడంతో చిన్నారులు గ్రామంలోకి వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామస్తుల సహకారంతో రెండు విద్యుత్‌ మోటార్లు ఏర్పాటు చేసి బావిలో నీటిని తోడేశారు. అనంతరం మహేశ్‌ మృతదేహాన్నిపైకి తీసుకవచ్చారు. మృతుడికి భార్య స్రవంతి, ఆరేళ్ల కూతురు, ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నారు. కాగా మధ్యాహ్నం 12 గంటల వరకు ఎండలో ట్రాక్టర్‌ నడిపిన మహేశ్‌ అదే ఎండలో బావిలోకి దూకడంతో ఫిట్స్‌ వచ్చి మరణించి ఉండవచ్చని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..


లక్ష్మణ్‌ (ఫైల్‌)

కమాన్‌పూర్‌(మంథని): రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన పోలుదాసరి లక్ష్మణ్‌(28) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. గ్రామస్తుల వివరాలు.. లక్ష్మణ్‌ బేగంపేట ఎక్స్‌ రోడ్డులోని ఓ బేకరీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కరెంట్‌తో చేపలు పట్టేందుకు వాగులో దిగడంతో ప్రమాదవశాత్తు కరెంట్‌ తీగలు కాలికి తగిలి మృతి చెందాడు. కాగా చేపలు పట్టేందుకు లక్ష్మణ్‌ ఒక్కడే వెళ్లాడా, ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతుడికి భార్య కోమలత, ఎడాది కూతురు ఉంది. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రామగిరి ఎస్సై రవిప్రసాద్‌ తెలిపారు. మృతుడి కటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడు..

పాలకుర్తి(రామగుండం): మండలంలోని రామారావుపల్లి గ్రామానికి చెందిన అమ్ముల రమేశ్‌(22) చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. బసంత్‌నగర్‌ పోలీసుల వివరాలు.. రమేశ్‌ డిగ్రీ పూర్తి చేసి గ్రామంలో ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఫిట్స్‌ వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. ఆర్మీలో ఉద్యోగం సాధించాలని గతంలో రెండుసార్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ ర్యాలీలో పాల్గొన్న రమేశ్‌ అనారోగ్యం కారణంగా అర్హత సాధించలేకపోయాడు. ఫిట్స్‌వ్యాధి కారణంగా తాను ఉద్యోగం సాధించలేకపోతున్నానని మనస్తాపానికి గురై ఈనెల 14న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తుత్తి క్రీడా ప్రాంగణం




ఇవి తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు అనుకుంటే పొరపాటే. ఆయా గ్రామాల్లోని పాఠశాలల స్వాగత తోరణాలకు బోర్డు తగిలించారు అంతే.. వీటిని చూసి గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు కాగితాలపై లెక్కలు చూపడం తప్ప ఒరిగిందేమి లేదంటున్నారు. సుల్తానాబాద్‌ మండలం భూపతిపూర్‌, ఐతరాజుపల్లి గ్రామాల్లో పాఠశాల స్వాగత తోరణాలకు ఇలా క్రీడాప్రాంగణాల బోర్డు తగిలించి చేతులు దులుపుకున్నారు సంబంధిత అధికారులు.
- సాక్షి ఫొటోగ్రాఫర్‌, పెద్దపల్లి

అంతటా ఇన్‌చార్జిలే

- ఎంఈవోల నియామకంపై నిర్లక్ష్యం
- హెచ్‌ఎంలకే అదనపు బాధ్యతలు
- మండల ప్రత్యేక అధికారులుగా విధులు


పెద్దపల్లి ఎంఈఓ కార్యాలయం

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో మండల విద్యాధికారుల కొరత నెలకొంది. జిల్లాలో 14 మండలాలు ఉండగా ఏ ఒక్క మండలానికి రెగ్యులర్‌ మండల విద్యాధికారి లేకపోవడం గమనార్హం. ఆరు పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు అదనంగా 14 మండలాల ఎంఈఓ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సర్కార్‌ బడుల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నా.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేయాల్సిన అధికారికి అడ్డగోలుగా అదనపు బాధ్యతలు అప్పగించి, అసలు బాధ్యతలను నిర్వర్తించకుండా చేయడమేంటని విద్యార్థి, సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

నియామకంపై నిర్లక్ష్యం

రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఎంఈఓ విధులను ప్రధానోపాధ్యాయులే నిర్వర్తిస్తున్నారు. హెచ్‌ఎంలుగా విధులు నిర్వర్తించకుండా ఇతర విధులకే పరిమితం కావడంతో విద్యార్థుల బోధనకు ఇబ్బంది కలుగుతోంది. జిల్లాలో 14 మండలాలకు హెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈఓలుగా వ్యవహరిస్తున్నారు. కమాన్‌పూర్‌ జెడ్పీ హైస్కూల్‌ హెచ్‌ఎం సంపత్‌రావు ఒక్కరే ఐదు మండలాలకు ఎంఈఓగా వ్యవహరిస్తుండడం విశేషం. కమాన్‌పూర్‌, రామగిరి, అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాల ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీహైస్కూల్‌ హెచ్‌ఎం పెద్దపల్లి, సుల్తానాబాద్‌ మండలాల ఎంఈఓగా, ఓదెల మండలం కొలనూర్‌ హైస్కూల్‌ హెచ్‌ఎం ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌ మండలాల ఎంఈఓగా, ఎలిగేడు మండలం ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం ఎలిగేడు, జూలపల్లి మండలాల ఎంఈఓగా, మంథని బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం మంథని, ముత్తారం మండలాల ఎంఈఓగా, ధర్మారం హైస్కూల్‌ హెచ్‌ఎం ధర్మారం మండల ఎంఈఓగా వ్యవహరిస్తున్నారు. ఇంతేకాకుండా వీరిని మండల ప్రత్యేకాధికారులుగా నియమించి అదనపు బాధ్యతలను అప్పగించారు. మండల విద్యాధికారులను నియమించి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా చూడాలని విద్యార్థులు, పేరేంట్స్‌ కోరుతున్నారు.

ఇబ్బంది రానీయం

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.
– మాధవి, జిల్లా విద్యాధికారి

బొగ్గుబాయి

సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న శశిధర్‌రాజు

కమాన్‌పూర్‌(మంథని): సింగరేణిలో భద్రతపై సెక్యూరిటీ సిబ్బంది రాజీ పడొద్దని సంస్థ చీఫ్‌ సెక్యూరిటీ అధికారి ఎం.శశిధర్‌రాజు సూచించారు. ఆర్జీ–3 పరిధి అడ్రియాల, పంచ్‌ ఎంట్రీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీకి సంబంధించిన విషయాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావుతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రాజెక్టు ఏరియాలో ఉండే విలువైన వస్తువులు, కేబుల్స్‌ను కాపాడుకునేందుకు సెక్యూరిటీ ఆ ఏరియాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. కోల్‌ చెక్‌ పోస్టులో కోల్‌ ట్రాన్స్‌పోర్ట్‌పై సెక్యూరిటీ సిబ్బంది అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలించారు. డ్యూటీలో ఉండే సెక్యూరిటీ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సీనియర్‌ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఆర్జీ–3 జీఎంగా సుధాకర్‌రావు


బాధ్యతలు స్వీకరించిన జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్‌(మంథని): ఆర్జీ–3 జీఎంగా ఎస్‌.సుధాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీఎంగా పని చేసిన టి.వెంకటేశ్వరరావు గత నెలలో ఉద్యోగ విరమణ పొందగా, ఆర్జీ–2 జీఎం మనోహర్‌ ఇన్‌చార్జి జీఎంగా కొనసాగుతున్నారు. ప్రాజెక్టు ప్లానింగ్‌ కార్యాలయంలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా విధుల్లో చేరిన జీఎంకు ఆర్జీ–3 ఏరియా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడారు. అందరం కలిసికట్టుగా పనిచేసి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం మనోహర్‌, జీఎం సుధాకర్‌రావును అధికారులు సన్మానించారు. ఏరియా ఇంజినీరు ఎలిషా, ఫైనాన్స్‌ జీఎం శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, నరేందర్‌, రమేష్‌, ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ, సర్వే అధికారి జైనులబద్దిన్‌, పర్సనల్‌ డీజీఎం విలాస్‌ శ్రీనివాస్‌పాద్దార్‌, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్‌, సివిల్‌ డీజీఎం పద్మరాజు, ఇంజినీర్లు శ్రీనివాస్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీఎం సుధాకర్‌రావును ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఏఎల్‌పీ ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, వెంకటరమణ తదితరులున్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలి


మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్‌(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ప్రాజెక్టు లేబర్‌ గేట్‌ వద్ద జరిగిన జనరల్‌ బాడీ సమావేశంలో మాట్లాడారు. చర్చల పేరుతో కాలయాపన చేయడం సరికాదని, యాజమాన్యం సత్వరమే కార్మిక సంఘాలతో చర్చించి మెరుగైన వేతన ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. విద్యుత్‌ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమను మరచిపోవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్‌రావు

గోదావరిఖనిటౌన్‌: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు చట్టాలు, మహిళల హక్కులు, వాటిని వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌ చట్టవిరుద్ధమని, విద్యార్థినులను ర్యాగింగ్‌ పేరిట వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. న్యాయవాది శాంతన్‌కుమార్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ ఖాజా జహీర్‌ అహ్మద్‌, వైస్‌ ప్రిన్సిపల్‌ కలందర్‌భాష, న్యాయవాది చంద్రశేఖర్‌, కోర్టు సిబ్బంది తిరుపతమ్మ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘మాతాశిశు’లో వసూళ్లపై విచారణ కమిటీ

సాక్షి స్పందన

మంథని: మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో అక్రమ వసూళ్లపై విచారణ కమిటీని నియమించనున్నట్లు జిల్లా ప్రధాన ఆస్పత్రుల అధికారి(డీసీహెచ్‌) డాక్టర్‌ శ్రీధర్‌ తెలిపారు. ‘ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరిన అవినీతి’శీర్షికన ఈనెల 16న ‘సాక్షి’లో ప్రచురితం అయిన కథనం ఆయా ప్రభుత్వ శాఖల్లో ప్రకంపనలు సృష్టించింది. రెండు రోజులుగా జిల్లా ఉన్నతాధికారులు అవినీతి తిమింగళాలపై ఆరా తీసినట్లు తెలిసింది. సివిల్‌ సర్జన్‌ ఆధ్వర్యంలో కమిటీ వేసి అక్రమ వసూళ్లపై విచారణ జరిపిస్తామని శ్రీధర్‌ తెలిపారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై వారంలోగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలి

మంథని: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, నూతన పీఆర్‌సీ కమిటీ వేయాలని మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు పంపిన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో ఉపాధ్యాయులు ముందుండి పోరాడారని, అలాంటివారికి జీవో 317తో చాలా నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని ఆలోచించి సీపీఎస్‌ రద్దు చేసి పాత పెన్షన్‌ పునరుద్ధరించాలని కోరారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్‌

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియా సీఈఆర్‌ క్లబ్‌లో శనివారం క్వార్టర్ల కేటాయింపుపై కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈసందర్భంగా 660 క్వార్టర్లకు 173 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌కు 61 మంది హాజరయ్యారు. 52 మంది ఉద్యోగులు క్వార్టర్లను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వో–2 జీఎం బచ్చ రవీందర్‌, టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌, డీజీఎం రాజేంద్రప్రసాద్‌, ప్రతాపగిరి రాజు, పర్సనల్‌ అధికారి వేణుగోపాల్‌ పాల్గొన్నారు.

మహిళలు, వృద్ధులకు టీ–9 టికెట్‌

గోదావరిఖనిటౌన్‌: మహిళలు, సీనియర్‌ సిటిజన్లకు ఆర్టీసీ టీ–9 టికెట్‌ విధానాన్ని ప్రవేశపెట్టిందని గోదావరిఖని డిపో మేనేజర్‌ పి.మల్లేశం తెలిపారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు వచ్చివెళ్లేందుకు రూ.100గా నిర్ణయించామని పేర్కొన్నారు. ఇందులో టోల్‌ట్యాక్స్‌ మినహా రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుందని, 60 ఏళ్లు పైబడిన వారు కండక్టర్‌కు తమ ఆధార్‌ కార్డు చూపించి టీ–9 టికెట్‌ పొందవచ్చని సూచించారు.

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వండి

- ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్‌ వేల్పుల కుమారస్వామి

గోదావరిఖని: ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్‌ వేల్పుల కుమారస్వామి కోరారు. గోదావరిఖనిలోని సీఐటీయూ కార్యాలయంలో బి.గణేష్‌ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకొచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు ఇస్తామన్నా.. కార్యరూపం దాల్చడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న అన్ని మండల కేంద్రాల్లో ధర్నా చేస్తామని తెలిపారు. సమావేశంలో వై.యాకయ్య, ముత్యంరావు, మహేశ్వరి, సాగర్‌, సారయ్య, నాగమణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌ దుర్మరణం

- కొత్తగట్టు వద్ద చెట్టును ఢీకొన్న కారు


కొమురారెడ్డి (ఫైల్‌)



కన్నీటి పర్యంతమవుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ దంపతులు, చెట్టును ఢీకొన్న కారు

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కొత్తగట్టు–గొల్లపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి పక్కన కారు చెట్టును ఢీకొన్న ఘటనలో సర్పంచ్‌ గోపు కొమురారెడ్డి(53) దుర్మరణం చెందాడు. ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపిన వివరాలు.. హుజురాబాద్‌ మండలం కనుకులగిద్దె సర్పంచ్‌ గోపు కొమురారెడ్డి శుక్రవారం భార్య రమతో కలిసి కారులో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి సమీపంలో శుభకార్యానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం కరీంనగర్‌లో పని ఉందని కొమురారెడ్డి కారులో ఒక్కడే వచ్చాడు. రాత్రి కరీంనగర్‌లో నిద్రించి శనివారం వేకువజామున కనుకులగిద్దెకు బయలుదేరాడు. శంకరపట్నం మండలం కొత్తగట్టు–గొల్లపల్లి గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారుతో చెట్టుకు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో బె లూన్‌లు ఓపెన్‌ అయినా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ప్రమాద విషయం తెలుసుకున్న హుజురాబాద్‌ రూరల్‌ సీఐ సంతోష్‌, ఎస్సై చంద్రశేఖర్‌ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కూతుర్లు ఉజ్వల, అఖిల ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనుకులగిద్దెలో విషాదం

హుజురాబాద్‌రూరల్‌: మండలంలోని కనుకులగిద్దె సర్పంచ్‌ కొమురారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. రాజకీయాలకతీతంగా అందరితో సన్నిహితంగా ఉంటూ మెలిగిన వ్యక్తి అకాల మృతిచెందడంతో ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా కొమురారెడ్డి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు అత్యంత సన్నిహితుడు. ఈటల టీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో మండల అధ్యక్షుడిగా పనిచేశాడు. ఈటల బీజేపీలో చేరడంతో అతను సైతం ఆ పార్టీలో చేరాడు. కొమురారెడ్డి మృతి వార్త తెలుసుకున్న ఈటల దంపతులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. మృతదేహానికి నివాళి అర్పించి, కొమురారెడ్డితో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు తెచ్చుకొని కన్నీటిపర్యంతమయ్యారు. అలాగే పార్థివదేహానికి ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు నివాళి అర్పించారు.

ప్రియుడి చేతిలో మోసపోయిన యువతి

- అవమాన భారంతో తల్లి ఆత్మహత్య
- బైఠాయించిన ప్రియురాలు


సారవ్వ(ఫైల్‌)


అంబులెన్స్‌ వద్ద బాధితులు, పోలీసుల వాగ్వాదం

గన్నేరువరం(మానకొండూర్‌): కూతురు ప్రియుడి చేతిలో మోసపోయిందనే అవమాన భారంతో ఓ తల్లి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..కరీంనగర్‌ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాడ బాపురెడ్డి, అదే గ్రామానికి చెందిన బండి లత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల చాడ బాపురెడ్డి మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అయితే చాడ బాపురెడ్డి తనను మోసం చేశాడని ఈనెల 15న లత పోలీసుల ఆశ్రయించింది. ప్రియుడితోనే ఉంటానని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని స్పష్టంచేసింది. దీంతో పోలీసులు ఆమెను కరీంనగర్‌లోని సఖి కేంద్రానికి తరలించి భద్రత కల్పించారు. ఇంతలోనే లత తల్లి సారవ్వ(42) కూతురికి అన్యాయం జరిగిందని మనోవేదనకు గురై శుక్రవారం రాత్రి పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో సారవ్వ మృతి చెందింది. శనివారం మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ప్రియుడు బాపురెడ్డి ఇంటి ఎదుట సారవ్వ శవాన్ని ఉంచేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌ సర్ది చెప్పేప్రయత్నం చేసినా.. వినిపించుకోలేదు. మృతురాలి కూతురు బండి లత ప్రియుడు బాపురెడ్డి ఇంటి ఎదుట బైఠాయించింది. మాయమాటలతో తనను మోసం చేశాడని ఆరోపించింది. కుటుంబం విచ్ఛిన్నం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేసింది. పురుగుల మందు తాగించి హత్య చేసేందుకు యత్నించాడని పేర్కొంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్‌ సీఐ ఇంద్రసేనారెడ్డి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్‌ జనగామ మల్లేశ్‌ మూడు రోజుల క్రితం బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువాలోని రూ.10 వేలు, రూ.40 వేలు విలువ చేసే ముప్పావు తులం బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌ తెలిపారు. కాగా గతంలో కాల్వశ్రీరాంపూర్‌లో కోలేటి రాజబాబు తాళం వేసి ఊరెళ్లిన సమయంలో దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న నగలు, టీవీ ఎత్తుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ గోలి సత్యనారాయణ ఇంట్లో ఇదేరీతిన దొంగలు దోచుకెళ్లారు. ఎవరైనా ఊరెళ్తే ఇరుగుపొరుగు వారికి చెప్పాలని ఎస్సై సూచించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి


తనిఖీ చేస్తున్న అధికారులు

మంథని: రైతులకు నాణ్యమైన విత్తనాలే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సూచించారు. శనివారం మంథని మండలంలోని విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. షాపుల్లో ధరల పట్టిక తప్పనిసరి అని, రైతులకు రశీదులు ఇవ్వాలని పేర్కొన్నారు. సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. తగినంత వర్షపాతం నమోదయ్యాకే విత్తనాలు వేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి అనూష, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్‌ స్కూల్‌లో పాఠ్య పుస్తకాలు సీజ్‌

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను శనివారం మండల ఇన్‌చార్జి విద్యాధికారి ఛాయాదేవి సీజ్‌ చేశారు. ప్రైవేటు పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌ అజయ్‌ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో సదరు పాఠశాలకు వెళ్లి పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్‌చేశారు.